మార్పు కోసం ...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 129/ 01 శుక్రవారం, డిసెంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-



# తెలంగాణలో ముగిసిన పోలింగ్

## -క్యూలో ఉన్న వారికి ఓటేసే ఛాన్స్ -65 నుంచి 68 శాతం మధ్యలో పోలింగ్
## -3న కౌంటింగ్ ప్రక్రియ...అదేరోజు ఫలితాల ప్రకటన

**హైదరాబాద్,నవంబర్30 (మరో ఉదయం):**

తెలంగాణలో పోలింగ్ పక్రియ ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లో ఉన్న వారికి ఓటు వేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ మందకొడిగా ఉందని సమాచారం అందింది. మొత్తం మీద తెలంగాణలో 65 నుంచి 68 శాతం మధ్యలోనే పోలింగ్ నమోదవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీంతో 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం తగ్గనుంది. 3న ఓట్ల లెక్కింపు జరుగనుంది. 3న ఉదయం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. 2018 ఎన్నికల్లో 73 శాతం పోలింగ్ నమోదైంది. కాగా రాత్రి 7 గంటల తర్వాత పోలింగ్ శాతాన్ని ఈసీ అధికారికంగా వెల్లడించనుంది. 119 నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి పక్రియ ప్రారంభం కాగా, కొన్ని చోట్ల ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొన్నారు. కాగా, కొన్ని చోట్ల ఈవీఎంల మొరాయింపుతో ఓటర్లు క్యూలో ఇబ్బంది పడ్డారు. అటు, హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైంది. ఓటు వేయాలని ఎన్నికల సంఘం, పలువురు ప్రముఖులు ఎంత అవగాహన కల్పించినా మార్పు రాలేదు. సమస్యాత్మక కేంద్రాల్లో 13 నియోజకవర్గాల్లోనే పోలింగ్ ముగిసింది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ముగిసింది రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. 5 గంటల లోపు క్యూలైన్లలో నిల్చున్న వారికి మాత్రమే ఓటేసేందుకు అధికారులు అనుమతిస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రజాస్వామ్య పండుగలో సాధారణ ఓటర్లతో పాటు సెలబ్రిటీలూ ఓటేసేందుకు పోటెత్తారు. సాధారణ పౌరుల్లా క్యూలో నిల్చొని మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో 2,290 మంది అభ్యర్థులు బరిలో నిలువగా.. 3,26,18,205 మంది ఓటర్లలో ఎంత శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారో తెలియాల్సి ఉంది. సాయంత్రం 3 గంటల వరకు 52 శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం. డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.


# కొల్లాపూర్‌లో బర్రెలక్కకు ఎన్ని ఓట్లు పడతాయి?..

## ఎగ్జిట్ పోల్ అంచనా ఇదే!

15 వేల ఓట్లు వస్తాయని అంచనా వేసిన 'ఆరా మస్తాన్' సర్వే

శిరీష గెలవకపోయినా గట్టి పోటీ ఇస్తుందని విశ్లేషణ

కొల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు గెలుస్తారని వెల్లడి



లకొల్లాపూర్ శాసనసభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి యావత్ దేశం దృష్టిని ఆకర్షించిన బర్రెలక్క (శిరీష) విజయం సాధిస్తుందా? గురువారం ముగిసిన పోలింగ్‌లో ఆమెకు ఎన్ని ఓట్లు పడి ఉంటాయి? అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. మరీ ముఖ్యంగా పోలింగ్ ముగిసిపోవడంతో బర్రెలక్క గెలుపుపై అంచనాలు ఏ విధంగా ఉన్నాయనే చర్చ ఊపందుకుంది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం వెలువడిన 'ఆరా మస్తాన్ సర్వే' శిరీషకు 15 వేల వరకు ఓట్లు రావొచ్చని లెక్కగట్టింది. శిరీష గెలవకపోయినా గట్టి పోటీ ఇస్తుందని, ఓటర్లను ఆమె పెద్ద సంఖ్యలో ఆకర్షించుకోగలిగిందని పేర్కొంది. ఇక ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు గెలుపొందన ్నారని విశ్లేషించింది. ఇదిలావుంచితే తెలంగాణ ఎన్నికలు -2023లో కీలక ఘట్టం పూర్తయ్యింది. గురువారం సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. సాయంత్రం వెలువడిన ఎగ్జిట్ పోల్ సర్వేలు కాంగ్రెస్‌కే పట్టం కట్టాయి. హస్తం పార్టీ అధికారంలోకి వస్తుందని విశ్లేషించాయి. అయితే ఈ ఎగ్జిట్ పోల్స్ అన్నీ బోగస్ అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కొట్టిపారేశారు. ఎగ్జిట్ పోల్స్ అంచనా తప్పిన సందర్భాలను ఎన్నో చూశామని, బీఆర్ఎస్ 70 సీట్లు గెలుచుకుంటుందని అన్నారు. ఎగ్జిట్ పోల్స్‌ను చూసి బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ధైర్యం చెప్పారు.

# కాంగ్రెస్ విజయం ఖాయం

అన్ని ఎగ్జిట్ పోల్స్ ఇదే చెప్పాయి
3న ఫలితాల్లో గెలుపు మాదే
కామారెడ్డిలో కెసిఆర్‌ను ఓడిస్తున్నాం
మీడియాతో రేవంత్ రెడ్డి వెల్లడి


2 లో

# ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ వెల్లడి

## మూడు రాష్ట్రాల్లో అధికారానికి చేరువగా కాంగ్రెస్
## మధ్యప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్‌లో అనుకూలం
## రాజస్ఠాన్‌లో బిజెపికి పెరిగిన అవకాశాలు

**న్యూఢిల్లీ,నవంబర్30(మరో ఉదయం):**

తెలంగాణతో పాటూ మిజోరం, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఎన్నికలు ముగిశాయి. ప్రజలు వెలువరించిన తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఉంది. డిసెంబర్ 3న ఫలితాలు వెలువడనున్నాయి. మరోవైపు, ప్రజాతీర్పుపై ఉత్కంఠను మరింత పెంచుతూ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడ్డాయి. తాజా సర్వే ప్రకారం ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగగా, మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం దక్కించుకోబోతున్నట్లు వెట్టడించింది. దాదాపు అన్ని సర్వే సంస్థల్లో ఇంచుమించుగా ఇదే విషయం వెల్లడయ్యింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. రాజస్తాన్‌లో మాత్రం అధికారాన్ని బిజెపికి కట్టబెట్టబోతోంది. వామపక్ష తీవ్రవాద ప్రభావం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో ప్రధాన పోరు మాత్రం కాంగ్రెస్, బీజేపీ మధ్యే నెలకొంది. భూపేశ్ భాఘేల్ సారథ్యంలో తమకు గెలుపు తథ్యమని హస్తం పార్టీ భావిస్తుండగా మోదీ మ్యాజిక్‌తో విజయం తమదే నంటూ బీజేపీ ధీమాతో ఉంది. అవనీతి రహిత పాలన అందిస్తామంటూ ఆప్ కూడా తమ వంతు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నించింది. అయితే, ఎగ్జిట్ పోల్స్ ఫలితాల ప్రకారం బీజేపీ, కాంగ్రెస్ మధ్య సీట్ల విషయంలో స్వల్ప తేడానే ఉండటంతో ఉత్కంఠ మరింత పెరిగింది. డిసెంబర్ 3న అంచనాలు తారుమారయ్యే ఛాన్స్ కూడా ఉందని విశ్లేషకులు అంచనా వస్తున్నారు. రాజస్థాన్.. భారతదేశానికి పశ్చిమాన ఉన్న రాష్ట్రం. నవంబర్-25న 200 నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. ఒకే విడతలో జరిగిన ఈ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి పలు ప్రముఖ సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ రిలీజ్ చేశాయి. కాగా.. డిసెంబర్-03న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మధ్యే గట్టి పోటీ నెలకొంది. వాస్తవానికి రాజస్థాన్‌లో ఇటు బీజేపీగానీ, అటు కాంగ్రెస్ గానీ వరుసగా అధికారాన్ని దక్కించుకున్న దాఖలాల్లేవ్. ఒకదాని తర్వాత ఒకటి ఆల్టర్ నేటివ్‌గా మాత్రమే పార్టీలు గద్దెనెక్కుతున్న పరిస్థితి. ప్రతీ ఐదేళ్లకోసారి రాష్ట్రంలో ప్రభుత్వం మారుతోంది. ఇదివరకు కాంగ్రెస్ గెలవగా.. ఇప్పుడు కమలం పార్టీకే ప్రజలు పట్టం కడతారని కమలనాథులు ధీమా వ్యక్తం చేయగా.. సీన్ మాత్రం రివర్స్ అయ్యింది. మొత్తం 230 అసెంబ్లీ స్థానాలు కలిగిన మధ్యప్రదేశ్‌లో నవంబర్ 17వ తేదీన ఎన్నికలు ముగిశాయి. గతంలో పోలిస్తే ఈసారి రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైంది. 2018లో 75.63శాతం పోలింగ్ నమోదవ్వగా.. 2023లో 77.15శాతం పోలింగ్ నమోదు అయ్యింది. 2003 నుంచి మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ కేవలం 2018 ఎన్నికల్లో మాత్రమే గెలుపొందింది. అప్పటివరకూ బీజేపీనే అక్కడ అధికారంలో ఉంది. అయితే.. మార్చి 2020లో జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌ను విడిచిపెట్టి బిజెపిలో చేరి.. రాష్ట్రంలోని కమల్ నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టారు. బీజేపీకి చెందిన శివరాజ్ సింగ్ చౌహాన్ నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పుడు ఈసారి ఎవరు అధికారంలోకి

సాగర్ వ్యవహారంలో
# ఇంతకాలం మౌనమా
ఇప్పుడు ఉద్రిక్తతలు సృష్టించడం సరికాదు
జగన్ తీరుపై మండిపడ్డ పురందేశ్వరి


2 లో

# బీజేపీకి 30 సీట్ల వరకు వస్తాయి

సంకీర్ణ రాజకీయాల్లో ఏమవుతుందో చూడాలి
ఈటల ఆసక్తికర వ్యాఖ్యలు
తమకు 25 నుంచి 30 సీట్లు వస్తాయని..
బీఆర్ఎస్‌తో కలిసేది లేదని స్పష్టీకరణ
కేసీఆర్ చెప్పేదొకటి... చేసేది ఒకటి అని ధ్వజం
కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేశారని విమర్శలు


2 లో

# బిఆర్‌ఎస్ చరిత్ర సృష్టిస్తుంది

మళ్లీ విజయం కెసిఆర్‌దే


2 లో

# ఎగ్జిట్ పోల్ అంచనాలు ట్రాష్

మళ్లీ అధికారం మాదే
అన్న కెటిఆర్
హ్యాట్రిక్ కొట్టబోతున్నామని ధీమా
కొందరిని విచారించి
ఫలితం ఇదని ఎలా
చెబుతారని ప్రశ్న
డిసెంబర్ 3న అధికారం
మాదే అని తేలుతుంది



**హైదరాబాద్,నవంబర్30(మరో ఉదయం):**

ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చూసి కంగారు పడాల్సిన పని లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ అధికారం బీఆర్ఎస్ పార్టీదే ... రు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత తెలంగాణ భవన్ లో కేటీ...

మిగతా 2 లో

మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## ప్రజాతీర్పును గౌరవించాలి !

ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసాయి. పోలింగ్ కూడా పూర్తి కావచ్చింది. ప్రజలు ఎవరికి అధికారం కట్టబెట్టాలో తీర్పునిచ్చారు. డిసెబర్ 3న తీర్పు వెల్లడి కానుంది. వారి తీర్పును గౌరవించి స్వాగతించాలి. ఇదే సమయంలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఐదు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువు తీరనున్నాయి. అలాగే వచ్చే మేలో సార్వత్రిక ఎన్నికలు జరుగ బోతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికైనా పార్లమెంట్‌లో ప్రజాస్వామ్య యుతంగా చర్చలకు అవకాశం రావాలి. ప్రధానంగా కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. కేంద్ర,రాష్ట్రాల్లో ఏ పార్టీ ప్రభుత్వాలు ఉన్నా ప్రజాస్వామ్యం దెబ్బతినరాదు. ప్రజల తీర్పును అపహాస్యం చేయరాదు. ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తూ మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాపాడడంతో పాటు సంబంధాలను బలపర్చాలి. కేంద్ర,రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న దాడి, గవర్నర్ వ్యవస్థ ద్వారా కేంద్రం పెత్తనం చెలాయించేలా చేస్తున్న ప్రయత్నాల పై ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. ప్రాంతీయపార్టీలు ఇవే అంశాలపై ఆందోళన చెందుతు న్నాయి. దీనిపై ఉమ్మడిగా పోరాడాలన్నప్రయత్నాలు వ్యక్తం అవుతున్నా సంఘటితం కాలేకపోతున్నాయి. ప్రాంతీయ పార్టీల మధ్య సంఘటితం కావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా దక్షిణాది సిఎంలు ఏకాభి ప్రాయానికి రావాల్సి ఉంది. నిజానికి గవర్నర్ వ్యవస్థను కాంగ్రెస్ బాగా భ్రష్టు పట్టించింది. దీనిని రద్దు చేయాలన్న అభిప్రాయం ఉంది. రాజకీయపార్టీలు ముందుగా ఈ విషయంలో చర్చచేయాల్సి ఉంది. మన రాజ్యాంగ నిర్మాతలు కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలుగా విభజించారు. పంచాయత్‌రాజ్ చట్టం ఆమోదించిన తర్వాత, స్థానిక స్వపరిపాలన సంస్థలకు హక్కులు ఇవ్వబడ్డాయి. వాటికి అధికారాలు కేటాయించబడ్డాయి. గ్రామాలు అభివృద్ధి చెందాలి. గ్రామాల అభివృద్ధితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుంది. దేశంలోని గ్రామాలు, రాష్ట్రాల అధికారాలను నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న తీరు సరికాది. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. కేంద్రం తరచూ రాజ్యాంగం నిర్వచించిన అధికార పరిధిని ఉల్లంఘిస్తోంది. కేంద్ర తన పరిధిని విస్తరించే క్రమంలో రాష్ట్రాల అధికారాలను ఆక్రమించాలని చూస్తోంది. ఇది కాంగ్రెస్ హయాంలోనూ జరిగింది. ఇప్పుడు మోడీ హయాంలో నిత్యం జరుగుతోంది. నిజానికి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలహీనపడ్డాయి. అందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రభుత్వమే కారణమని చెప్పు కోవాలి. రాజ్యకాంక్ష విస్తరణతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారు. జాతీయ విధానాలను తుంగలో తొక్కారు. రాష్ట్రాలన్ని కలిస్తేనే దేశం అవుతుంది. అలాంటి రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రతి దానికీ బిచ్చం ఎత్తుకునేలా పరిస్థితి తీసుకుని వచ్చారు. మరోవైపు బిజెపీయేతర రాష్ట్రాలపట్ల వివక్షత చూపుతోందని ఆయా రాష్ట్రాల సిఎంలు విమర్శిస్తున్నారు. రాష్ట్రాలు, స్థానిక సంస్థలను లొంగదీసుకునే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం అధికారాలను కేంద్రీకరించే ధోరణిని కలిగి ఉందని వారు ఆరోపిస్తు న్నారు. బిజెపి అధికారంలోకి రాగానే, రాష్ట్రాల హక్కులను పునరుద్దరిస్తారని భావించారు. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంలో ప్రదాని మోడీ ఇదే చెప్పారు. కానీ అలా జరగడం లేదు. వాటి హక్కులకు భంగం కలిగించి, వాటి ఆర్థిక హక్కులను హరించే విధంగా జిఎస్‌టిని అమలు చేస్తోంది. పన్నుల వసూళ్లను కొల్లగొట్టారు. పరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా పరిహారం ఇవ్వటం లేదు. అరకొర పరిహారం కూడా సకాలంలో ఇవ్వటం లేదు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకి రావాల్సిన నిధులు కూడా విడుదల చేయడంలేదు. కీలకమైన అంశాలపై చర్చలు లేకుండా, రాష్ట్రాలతో సంప్రదింపులు చేయకుండానే చట్టాలు చేయడం, నిర్ణయాలు తీసుకోవడం జరుగుతోంది. ఇప్పటికైనా ఈ సంప్రదాయన్ని పక్కన పెట్టాలి.రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని పార్లమెంట్ వేదికగా అన్ని అంశాలు చర్చించాలి. ముందు చర్చించడాని కి పూనుకోవాలి. పార్లమెంటులో సమస్యలపై చర్చించాలి. రాష్ట్రాలు లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పార్లమెంటులో చట్టాలను ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించుకుంటున్న తీరు గత పదేళ్లుగా చూస్తున్నాం. పార్లమెంటులో ప్రత్యేకమైన, అర్థవంతమైన చర్చలు లేకుండా ముగించేస్తున్నారు. పార్లమెంట్ సభ్యులు లేవనెత్తిన ఏ ప్రశ్నలకు సరైన సమాధానాలు రావడం లేదు. మోడీ ప్రభుత్వం ఎవరికీ జవాబు దారీతనం లేని విధంగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మెజారిటీ ఉన్నందున ప్రతి చర్యను నిర్మోహ మాటంగా అమలు చేస్తున్నది. ఈ చర్యలన్నీ ఒక్కో రాష్ట్రంలో గవర్నర్ కార్యాలయాన్ని ఉపయోగించి అమలు చేయవచ్చని భావిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికైన మంత్రివర్గం ఉన్నప్పుడు, గవర్నర్ కార్యాలయం ద్వారా రాష్ట్రాన్ని పాలించాలని కోరడం రాజ్యాంగ విరుద్ధం. ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాల్లో రాజ్‌భవన్ ద్వారా సమాంతర ప్రభుత్వాన్ని నడపాలని చూస్తున్నారు. రాజ్యాంగం ఆర్థిక విషయాలలో యూనియన్‌కు ప్రాధాన్యత ఇచ్చింది. ఉమ్మడి జాబితాలోని విషయాల్లో కూడా రాష్ట్రాల కంటే యూనియన్‌కే ఎక్కువ పట్టు ఉంది. రాజ్యాంగంలో పేర్కొనని విషయాలపై కేంద్రం నిర్ణయం తీసుకోవచ్చు. మన సమాఖ్య నిర్మాణం ఏకీకృత పక్షపాతాన్ని కలిగి ఉంది. ఇది రాష్ట్రాలకు తీవ్రమైన పరిమితులను సృష్టించింది. రాష్ట్రాల హక్కులను కాపాడుకోవలసి ఉంది. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను నిర్వీర్యం చేస్తున్న మోడీ ఇప్పటికైనా ప్రజాస్వ3ఆమ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్రాలకు గౌరవం ఇవ్వాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లగలదు. మోడీ హయంలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు విచ్ఛిన్న మయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ వాటిని సరిదిద్దుకోవాలి.

# తెలంగాణలో అనూహ్య ఫలితాలు

**-అధికారానికి చేరువగా కాంగ్రెస్**

**-అన్ని సర్వే సంస్థల్లోనూ ఇదే వెల్లడి**

**-కామారెడ్డిలో కెసిఆర్ ఓటమి తప్పదన్న అంచనాలు**

**-గజ్వేల్‌లో బొటాబొటీ మెజార్టీతో గెలుస్తారని వెల్లడి**

**-కొల్లాపూర్‌లో వణుకు పుట్టించిన బర్రెలక్క**

**హైదరాబాద్,నవంబర్30 (మరో ఉదయం):**

తెలంగాణలో హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు రాబోతున్నట్లు పలు సర్వే సంస్థలు వెల్లడించాయి. దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్‌లో .. కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చే అవకాశం ఉందని తేల్చాయి. అధికార బిఆర్ఎస్ రెండో స్థానానికి పరిమితం కావడంతో పాటు, కామారెడ్డిలో కెసిఆర్ ఓడిపోతున్నట్లుగా తేల్చాయి. కొంచెం అటుఇటుగా అన్ని సంస్థలు కాంగ్రెస్‌కు సానుకూలత ఉన్నట్లు సర్వే ఫలితాలను వెల్లడించాయి. ఇండియా టివి,ఎబిపి, సిఎన్ఎన్,జన్‌కీ బాత్,పల్స్ టుడే వంటి సంస్థలు సర్వే చేపట్టాయి. అదే సమయంలో హంగ్ అసెంబ్లీ అంచనాలను కూడా తోసిపుచ్చలేమని ఏబీపీ సీఓటర్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్‌లో స్పష్టమయింది. కాంగ్రెస్ పార్టీకి 49 నుంచి 65 సీట్ల వరకూ వచ్చే అవకాశం ఉందని తేలింది. అదే సమయంలో భారత రాష్ట్ర సమితికి 38 నుంచి 54 సీట్లు వచ్చే అవకాశం ఉంది. భారతీయ జనతా పార్టీ కూటమికి మూడు నుంచి 13 సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. ఇతరులు 5 నుంచి 9 స్తానాల్లో గెలుస్తారు. ఇతరుల్లో మజ్లిస్ పార్టీ కూడా ఉంది. ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం కాంగ్రెస్ పార్టీకి 40.7 శాతం ఓట్లు వస్తాయి. అంటే గత ఎన్నికలతో ఓటింగ్ పర్సంటేజీ దాదాపుగా 12.4 శాతం పెరుగుతుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 28.3 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. భారత రాష్ట్ర సమితికి ఏకంగా 8.1 శాతం ఓట్లు తగ్గబోతున్నాయి. ఆ పార్టీకి 38.8 శాతం వరకూ ఓట్లు వచ్చే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 46.9 శాతం ఓట్లు వచ్చాయి. భారతీయ జనతా పార్టీ ఓట్ల శాతం పరంగా భారీగా లబ్ది పొందుతోంది. గత ఎన్నికల్లో కేవలం ఏడు శాతం ఓట్లే ఆ పార్టీకి వచ్చాయి. కనీ ఈ సారి మాత్రం ఏకంగా 17శాతం ఓట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ లో వెల్లడయింది. ఏకంగా 9 శాతం ఓట్లు బీజేపీకి పెరుగుతాయి. ఇతర పార్టీలకు వచ్చే ఓట్ల శాతం ఈ సారి బాగా తగ్గిపోయింది. గత ఎన్నికల్లో ఇతరులకు 17.8 శాతం ఓట్లు రాగా ఈ సారి ఆ శాతం కేవలం 4.5 శాతానికి పడిపోతుందని తేలింది. మార్జినల్స్ ఇవ్వకుండా ఖచ్చితంగా సీట్ల ప్రొజెక్షన్ అంచనా వేయాలంటే.. హంగ్ వస్తుందని ఏబీపీ సీఓటర్ ఎగ్జిట్ పోల్ చెబుతుంది. అయితే కాంగ్రెస్ పార్టీ సాధారణ మెజార్టీకి చాలా దగ్గరగా వస్తుంది. కాంగ్రెస్ పార్టీకి 57 సీట్ల వరకూ వచ్చే అవకాశం ఉంది. గత ఎన్నికలతో పోలిస్తే 38 సీట్లు ఎక్కువ. బీఆర్ఎస్ పార్టీ 42 సీట్లను కోల్పోయి 46 దగ్గర స్థిరపడుతుంది. బీజేపీ ఒకటి నుంచి ఎనిమది స్థానాలకు పెరుగుతుంది. అదర్స్ కు ఏడు సీట్లే వస్తాయి. ఆ ఏడూ మజ్లిస్ కే వచ్చే చాన్స్ ఉంది. తెలంగాణ రాషట్ర సమితి ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉంది. ఈ సందర్భంగా అధికార వ్యతిరేకత ఉందని ఎగ్జిట్ పోల్స్ లో వెల్లడయింది. ఈ అధికార వ్యతిరేకత తీవ్రంగా ఉంటే కాంగ్రెస్ పార్టీకి 67 నుంచి 79 సీట్ల వరకూ లభించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ పరిస్థితి 29 నుంచి 41 సీట్లకు పరిమితమవ్వొచ్చు. బీజేపీకి నాలుగు నుంచి ఎనిమిది సీట్లు, ఇతరులకు మూడు నుంచి ఏడు సీట్లు వరకూ వస్తాయి. అంటే అధికార వ్యతిరేకత బాగా ఉంటే.. కాంగ్రెస్ పార్టీకి ఊహించనంత మెజార్టీ వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం తమకు ప్రజల్లో సానుకూలత ఉందని నమ్మకంతో ఉంది. ఎగ్జిట్ పోల్స్ లో అలాంటి వాతావరణ కనిపించక పోయినా.. ఓటర్లు చివరి క్షణంలో మనసు మార్చుకుని ఉంటే.. తెలంగాణలో బీఆర్ఎస్ సర్కార్ మరోసారి ఏర్పడుతుంది. కానీ.. అదీ అత్తెసరు మెజార్టీ లేదా హంగ్ ద్వారా మాత్రమే. ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి 40 నుంచి 52 స్థానాలు వస్తాయి. బీఆర్ఎస్ పార్టీకి 54 నుంచి 66 స్థానాలు వస్తాయని అంచనా. బీజేపీకి ఏడు నుంచి 11 సీట్లు లభిస్తాయి. ఇదిలావుంటే తెలంగాణ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్.. బీఆర్ఎస్ శ్రేణుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఏకంగా బీఆర్ఎస్ బాస్ సీఎం కేసీఆర్?కే ఓటమి తప్పదని ఆరా మస్తాన్ సర్వే వెల్లడించింది. కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మతంగా తీసుకున్న కామారెడ్డి నియోజకవర్గంలో ఓటమి తప్పదని సర్వేలో వెల్లడైంది. అలాగే కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి ఓడిపోయే అవకాశాలు ఉన్నాయని ఈ సర్వే వెల్లడించింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి వెంటకరమణా రెడ్డి గెలిచే అవకాశం ఉందని తెలిసింది. మరోవైపు గజ్వేల్‌లో కేసీఆర్ స్వల్ప మెజారిటీతో గెలుపొందుతారని ఆరా మస్తాన్ సర్వే సంస్థ తెలపడంతో బీఆర్ఎస్ పార్టీలో టెన్షన్ వాతావరణం నెలకొంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 5 గంటలకు ముగిసింది. 119 నియోజకవర్గాలకు గాను మొత్తం 2,290 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క పోటీ చేశారు. అయితే బర్రెలక్క భవితవ్యంపై ఎగ్జిట్ పోల్స్ ఏం చేప్తున్నాయి?. బర్రెలక్క గెలుస్తుందా అనే అంశంపై ఆరా మస్తాన్ సర్వే వివరాలను వెల్లడించింది. బర్రెలక్కకు 15 వేల ఓట్లు రావచ్చని ఆరా మస్తాన్ సర్వే పేర్కొంది. అయితే ఈమె గెలవకపోయినా గట్టి పోటీ ఇచ్చే ఛాన్స్ ఉందని స్పష్టం చేసింది. కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు గెలిచే అవకాశం ఉందని ఆరా సర్వే వెల్లడించింది. కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మర్రికల్ గ్రామంలోని బూత్ నెంబర్ 12లో ఆమె ఓటు వేశారు. హైకోర్టు ఆదేశాలతో బర్రెలక్కకు ఈసీ సెక్యూరిటీ కూడా ఇచ్చింది. ఆ సెక్యూరిటీతోనే ఆమె పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఓటు వేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బర్రెలక్క.. ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఓటు వేసేందుకు అందరూ పోలింగ్ కేంద్రాలకు రావాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

## కాంగ్రెస్ విజయం ఖాయం

**హైదరాబాద్,నవంబర్30(మరో ఉదయం):**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఇదే విషయం వెల్లడించాయని అన్నారు. నాయకులు, కార్యకర్తలు సంబరాలు మొదలుపెట్టాలని పిలుపునిచ్చారు. గురువారం ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్‌పై హర్షం వ్యక్తం చేశారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని చెప్పారు. కేసీఆర్‌ను కామారెడ్డిలో ఓడగొడుతున్నామన్నారు. ఇన్నాళ్లూ అధికారమే శాశ్వతమని కేసీఆర్ నమ్మారని, తెలంగాణ ప్రజల్లో చైతన్యం వచ్చిందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో డిసెంబర్ 3న శ్రీకాంతాచారి తుదిశ్వాస విడిచారని, అదే రోజున ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్నాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీకాంతాచారి ప్రాణత్యాగానికి ఎన్నికల ఫలితాలకు ఓ లింక్ ఉందని చెప్పారు. నేడు తెలంగాణ ఎన్నికల పోలింగ్ పూర్తైంది. ఎక్కువ శాతం ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కు మెజారిటీని కట్టబెట్టాయి. ఎగ్జిట్ పోల్స్ రబ్బిస్ అని కేటీఆర్ పేర్కొన్న వ్యాఖ్యలపై రేవంత్ స్పందించారు. అవి నిజమైతే కేటీఆర్ క్షమాపణలు చెబుతారా? అని రేవంత్ ప్రశ్నించారు. కెసిఆర్ అహంకారంపై ప్రజలు తిరుగుబాటు చేసారని అన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక ప్రజాస్వామ్య యుతంగా పాలన చేస్తుందని, అన్ని వర్గాలను దరికి చేరుస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యం నెలకొల్పుతామని అన్నారు. ఇదిలావుంటే ఈసారి తెలంగాణలో కాంగ్రెస్ 90 స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. 'నల్గొండలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేస్తుంది. ఎర్రబెల్లి ఓటమి ఖాయం. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రజలకు నమ్మకం కుదిరింది. కార్యకర్తల పోరాటం వృథా కాలేదు. డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. ఎన్టీఆర్ లాంటి వారే ఓడారు. కేసీఆర్ ఓ లెక్కా. కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోబోతున్నారు. కాంగ్రెస్ మార్క్ పాలన చూపిస్తాం.' అని తెలిపారు.

## ఎగ్జిట్ పోల్ అంచనాలు ట్రాష్

మొదటిపేజీ తరువాయి

మీడియాతో మాట్లాడారు. ' ఈరకమైన ఎగ్జిట్ పోల్స్‌ను గతంలోనూ చూశాం. ఎగ్జిట్ పోల్స్ తప్పు అని నిరూపించడం మాకు కొత్తేమీ కాదు. డిసెంబర్ 3న 70కి పైగా స్థానాలతో విజయం సాధిస్తాం. హ్యాట్రిక్ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎగ్జిట్ పోల్స్‌ను చూసి కంగారు పడాల్సిన అవసరం లేదు. కొన్ని మీడియా సంస్థలు సర్వేలు చేయకుండా.. ఏదో 200 మందిని అడిగినట్టు చేసి.. దాన్ని గొప్పగా చేసి చూపిస్తారు. గతంలో 5 మీడియా సంస్థలు సర్వేలు చేస్తే.. అందులో ఒక్కటే నిజమైంది.' అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజలు ఇంకా లైన్‌లో ఉండి ఓట్లు వేస్తూనే ఉన్నారని.. అప్పుడే ఎగ్జిట్ పోల్స్ వెల్లడించడటమేంటని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. అస్సలు ఏ లాజిక్‌తో ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్నారో అర్థం కావట్లేదని పేర్కొన్నారు. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తుందని అన్నారు. ఒకవేళ డిసెంబర్ 3న ఎగ్జిట్ పోల్స్ తప్పు అయితే.. తప్పు జరిగిందని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెబుతారా? అని ఎగ్జిట్ పోల్స్ ప్రచురించిన మీడియా సంస్థలను కెటిఆర్ ప్రశ్నించారు. ఎవ్వరూ కన్ఫ్యూజన్ కావద్దని.. వందకు 100 శాతం అధికారంలోకి వస్తామని స్పష్టం చేశారు. గత 90 రోజులుగా కష్టపడ్డ మా కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా గంట, గంటన్నర సేపు పోలింగ్ జరిగేది ఉందని.. 70కి పైగా స్థానాల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. 70కి పైగా స్థానాల్లో గెలుస్తాం అని ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై మంత్రి కేటీఆర్ స్పందించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, హ్యాట్రిక్ కొడతామని కేటీఆర్ తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ చూసి కంగారుపడాల్సిన అవసరం లేదని, ఎగ్జిట్ పోల్స్ తప్పయితే డిసెంబర్ 3 తర్వాత క్షమాపణలు చెబుతారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.'మళ్లీ అధికారం మాదే.. హ్యాట్రిక్ కొడతాం. 2018 తెలంగాణ ఎగ్జిట్ పోల్స్ తప్పని తేలాయని మంత్రి కేటీఆర్ అన్నారు.

## సర్వేలు ఎలా ఉన్నా గెలుపు మాదే

### రాజస్థాన్‌లో మరోమారు అధికారం సాధిస్తున్నాం

### బిజెపికి గెలిచే ఛాన్స్ లేదన్న గెహ్లాట్

**జయపుర,నవంబర్30(మరో ఉదయం):**

ఐదు రాష్ట్రాల ఎగ్జిట్ పోల్ ఫలితాలు వచ్చిన తరుణంలో.. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఎలా ఉన్నా.. రాజస్థాన్‌లో కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. ఒక్క రాజస్థాన్‌లో మాత్రమే కాదని.. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఇతర నాలుగు రాష్ట్రాల్లోనూ బీజేపీ గెలబోదని జోస్యం చెప్పారు. తన వాదనని బలపరిచేందుకు మూడు కారణాలు కూడా ప్రస్తావించారు. మొదటిది.. రాజస్థాన్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఎలాంటి వ్యతిరేకతా లేదన్నారు. రెండోది.. ముఖ్యమంత్రి. అభివృద్ధి పనులు చేయడంలో సీఎంకి తిరుగులేదని స్వయంగా బీజేపీ ఓటర్లే చెప్తారన్నారు. మూడోది.. బీజేపీ నేతల మాటతీరు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ ముఖ్యమంత్రులు, ఇతర కేంద్రమంత్రులు ఉపయోగించిన భాష ఎవరికీ నచ్చలేదన్నారు. తమ ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు బెదిరింపు, భయపెట్టే పదజాలాన్ని ఉపయోగించారని.. దాన్ని రాష్ట్ర ప్రజలు ఏమాత్రం ఆమోదించరని అన్నారు. అయితే.. బీజేపీకి చెందిన 'మతం కార్డు' వర్కవుట్ అయితే మాత్రం.. రాజస్థాన్‌లో వాళ్లు విజయం సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగా.. ఎగ్జిట్ పోల్ ఫలితాలు మాత్రం బీజేపీదే విజయమని చెప్తున్నాయి. బీజేపీకి 100 నుంచి 130 మధ్య సీట్లు రావొచ్చని.. కాంగ్రెస్‌కి 60 నుంచి 100 మధ్య సీట్లు వచ్చే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్ ఫలితాలు తెలుపుతున్నాయి. మొత్తం 200 స్థానాలు కలిగిన రాజస్థాన్‌లో అత్యధిక సీట్లు బీజేపీ కైవసం చేసుకుంటుందని, తద్వారా ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని ఎగ్జిట్ పోల్ రిజల్ట్స్ జోస్యం చెప్తున్నాయి. మరి.. ఎగ్జిట్ పోల్ ఫలితాలు నిజమవుతాయో? లేక అశోక్ గెహ్లాట్ నమ్మకం నిజం అవుతుందో? డిసెంబర్ 3వ తేదీన తేలిపోనుంది. ఇంతకీ రాజస్థాన్ ఎగ్జిట్ పోల్ పలితాలు ఎలా ఉన్నాయంటే..

మొదటిపేజీ తరువాయి

## బిఆర్ఎస్ చరిత్ర సృష్టిస్తుంది

### మళ్లీ విజయం కెసిఆర్‌దే

**హైదరాబాద్,నవంబర్30 (మరో ఉదయం):**

తెలంగాణ గడ్డ ఉద్యమాల గడ్డ, చైతన్యవంతమైన గడ్డ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పింక్ వేవ్ కనిపిస్తోందని అన్నారు. గురువారం జుబ్లీహిల్స్ లోని పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ చరిత్ర స్రృష్టిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ మళ్లీ విజయం సాధించి అధికారం చేపడతారని పేర్కొన్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులతోపాటు ఎమ్మెల్సీ కవిత అవిశ్రాంతంగా ప్రచారం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పార్టీ అభ్యర్థుల తరపున భారీ ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## బీజేపీకి 30 సీట్ల వరకు వస్తాయి

తెలంగాణలో బీజేపీకి 25 నుంచి 30 సీట్లు వస్తాయని, సంకీర్ణాల రాజకీయాల్లో ఇక ఏమవుతుందో చూడాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. అయితే తాము బీఆర్ఎస్‌తో కలిసేది మాత్రం లేదని తేల్చి చెప్పారు. ఈ రోజు పోలింగ్ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం మీద ఎంత వ్యతిరేకత ఉందో గజ్వేల్ నియోజకవర్గంలో తిరిగితే అర్థమవుతుందన్నారు. కేసీఆర్ చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి అని ధ్వజమెత్తారు. ఆయన నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. కేసీఆర్‌ను ఓడించేందుకు బలమైన నాయకుడు ఎక్కడ ఉంటే అక్కడ ప్రజలు ఓటు వేశారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజానీకం, యువత, మహిళల్లో మార్పు రావాలని, ఆ మార్పు బీజేపీకి రావాలని కోరుకున్నారన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేశారని ఆరోపించారు. అంతిమ నిర్ణేతలు ప్రజలే అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బీజేపీకి మేధావులు సహకరించారన్నారు. 2021లో... కేసీఆర్ డబ్బు సంచులను, మద్యంను ఎదుర్కొని నిలబడ్డామన్నారు. ఇప్పుడు బీజేపీ కార్యకర్తలతో పాటు అనేకమంది కష్టపడి పని చేశారని ఈటల తెలిపారు. కేసీఆర్ బాధితులు అందరూ తనను ఆదరించారన్నారు. బెదిరింపులకు పాల్పడ్డారని మండిపడ్డారు. గజ్వేల్ గడ్డపై బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో మెజార్టీ ఎక్కువో.. తక్కువో గెలుస్తున్నానని జోస్యం చెప్పారు.

## ఫర్నీచర్ తయారీ కర్మాగారంలో అగ్నిప్రమాదం

### రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం

**చిత్తూరు,నవంబర్30(మరో ఉదయం):**

చిత్తూరు జిల్లా వి.కోట మండల కేంద్రంలో ఓ ఫర్నీచర్ తయారీ కర్మాగారంలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. కె.కొత్తూరుకు చెందిన సయ్యద్.. పట్రపల్లి సమీపంలోని కెజిఎఫ్ రోడ్డులో ఉన్న కోళ్ల ఫారంలో ఫర్నీచర్ తయారీ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో షెడ్డులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గాలి బలంగా వీయడంతో మంటలు షెడ్డు మొత్తం వ్యాపించాయి. క్షణాల వ్యవధిలో షెడ్డులోని ఫర్నీచర్, తయారీ సామగ్రి కాలిబూడిదైంది. దట్టమైన పొగ పరిసరాల్లో వ్యాపించడంతో స్థానికులు చూసి యజమానికి సమాచారం అందించారు. అప్పటికే మంటలు ఎగసిపడుతూ ఫర్నీచర్ కర్మాగారం మొత్తం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షలు నష్టం వచ్చిందని యజమాని సయ్యద్ ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. స్థానికంగా ÷ర్‌స్టేషన్ అందుబాటులో లేకపోవడం, కుప్పం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికి కర్మాగారం పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా? మద్యం మత్తులో ఎవరైనా నిప్పు అంటిచారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

## ఇంతకాలం మౌనమా

**అమరావతి,నవంబర్30 (మరో ఉదయం):**

ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసమే నాగార్జునసాగర్ వద్ద వివాదం చేస్తున్నారని బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం చర్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. జగన్ మోహన్ రెడ్డి సర్కార్‌పై దగ్గుబాటి పురందేశ్వరి ఫైర్ అయ్యారు. నాగార్జున సాగర్ వద్దకు పోలీసులను పంపడం చాలా ఘోరం అన్నారు. నాలుగున్నరేళ్లుగా పట్టించుకోకుండా ఇప్పుడు ఎందుకు హడావుడి చేస్తున్నారంటూ విమర్శించారు. గతంలో ఏపీ, తెలంగాణ అధికారులు ఈ విషయంలో ఘర్షణ పడ్డారని ఆమె గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా చేస్తారా? అని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో 400 మండలాల్లో కరవు విలయతాండవం చేస్తుందన్నారు. కానీ, ప్రభుత్వం మాత్రం కేవలం 100 మండలాల్లోనే కరువు ఉందని చెప్పడం రైతులను అవమానించడమేనని తెలిపారు. కరవు విషయంలో క్యాబినెట్‌లో కూడా చర్చ జరగకపోవడం శోచనీయం అన్నారు. అసలు ఏపీలో వ్యవసాయ శాఖ మంత్రి ఎవరు అంటే ప్రజలు వెతుక్కుంటున్నారని దుయ్యబట్టారు. అదే నీటిపారుదల శాఖ మంత్రి ఎవరంటే మాత్రం చెబుతున్నారని తెలిపారు. రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని చెప్పుకొచ్చారు.

మార్పు కోసం... మరో ఉదయం

## మొయినాబాద్ లో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు..

### ఉత్సాహముతో పాల్గొన్న యువ. నవ ఓటర్లు.

### నాగిరెడ్డి గూడ గ్రామంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హాల్ చల్.

**మొయినాబాద్ :నవంబర్ 30(మరో ఉదయం)**



మొయినాబాద్ మండలంలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ ఆయా మండలాల్లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు .మండలంలో 64 పోలింగ్ బూత్లను ఏర్పాటు చేశారు ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఓట్ల సంఖ్యను బట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు .కట్టుదిట్టంగా ఎక్కడికి అక్కడ ఎలాంటి ఆలోచనలకు దారి తీయకుండా పోలీసులు కట్టడి చేశారు .గ్రామల్లో గురువారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఎన్నికలు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుండి దాదాపు 12 గంటల వరకు తక్కువ శాతం ఓట్ల నమోదు కాగా గ్రామాల నుంచి పట్టణాలను వెళ్లినటువంటి వారు తిరిగి రావడంతో 12 తర్వాత ఓటర్ల భారీగా తరలి రావడంతో గంటల తరబడి లైన్లో నిలబడ్డారు. దీంతో ఓటర్ల క్యూ లైన్ పెరిగింది .గంటల తరబడి లైన్లో నిలబడే ఓటర్లు తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. ఓటర్లకు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సమయం ఇవ్వడంతో ఐదు గంటల సమయం దాటిన తరువాత లోపలికి ఎవ్వరినీ అనుమతించలేదు ఐదు గంటల లోపు పోలింగ్ బూతులోకి వెళ్లినటువంటి ఓటర్లు సాయంత్రం ఏడు గంటల వరకు తమ ఓటును వేశారు. సాయంత్రం ఏడు గంటల వరకు దాదాపు చేవెళ్ల నియోజకవర్గం 63. 9 శాతం గా ఓట్లు శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం. కనకమామిడి బాకారం అమలాపూర్ నాగిరెడ్డి గూడ గ్రామాల్లో బూతులను సందర్శించారు. నాగిరెడ్డి గూడ గ్రామంలోకి వెళ్లినటువంటి బిఆర్ఎస్ అభ్యర్థికి చుక్కే ఎదురైంది టిఆర్ఎస్ అభ్యర్థి తనతోపాటు మరో ఆరు కారులను వెనుకేసుకొని కాన్వాయిగా నాగిరెడ్డి గూడ గ్రామానికి చేరుకొని పోలింగ్ గ్రౌండ్లోకి కార్లలో వచ్చి దాదాపు 30 మంది టిఆర్ఎస్ నాయకులతో పార్టీ కండువని వేసుకొని పోలింగ్ బూత్ లోకి రావడంతో అక్కడున్నటువంటి కాంగ్రెస్ నాయకులు ఈ సంఘటన పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు .దీంతో టిఆర్ఎస్ మరియు కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది .అక్కడ ఉన్నటువంటి పోలీసులు జోక్యం చేసుకొని అందరిని అక్కడ నుంచి చెదరగొట్టారు .ఈ తోపులాటలో టిఆర్ఎస్ అభ్యర్థి కాల యాదయ్య కారు అద్దం పగిలినట్టు గ్రామస్తులు తెలుపుతున్నారు.



## ఓటు హక్కు వినియోగించుకున్న టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్

**హైదరాబాద్ నవంబర్ 30(మరో ఉదయం)**

తెలంగాణ సీనియర్ ఐపీఎస్ అధికారి, టిఎస్అర్టిసి ఎం డి వీసీ సజ్జనర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొండాపూర్ చిరాక్ పబ్లిక్ స్కూల్ లోని 375వ పోలింగ్ బూత్ లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని ఓటు హక్కు చాటుతుందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లందరూ పాల్గొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, విద్యావంతులు ఓటు వేయడాన్ని తమ బాధ్యతగా భావించి.. పోలింగ్ లో పాల్గొనాలని అన్నారు.








## ఇరువర్గాల మధ్య గొడవ

**మరో ఉదయం ప్రతినిధి**

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో లింగంపేట మండలంలోని మంభోజిపేట్ గ్రామంలో టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల మధ్య గొడవ టిఆర్ఎస్ ఏజెంట్అభ్యర్థి ఓటింగ్ బూతులో ఓటర్లకు టిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలంటూ టిఆర్ఎస్ పార్టీ ఏజెంట్ అభ్యర్థి చెప్పగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గొడవ చేశారు రెండు పార్టీల మధ్య గొడవ కాగా పోలీసులు వచ్చి ఇరుగు వాటిల మధ్య గొడవ ఆపివేయడం జరిగింది తిరిగి పోలింగ్ యధావిధిగా కొనసాగింది అందరూ ఓటును వినియోగించుకుంటున్నారు



# షాబాద్ లో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

## - మండలంలో 73%పోలింగ్ నమోదు

## - పోలీసుల బందబస్తు మధ్య ఎన్నికలు.

**మరో ఉదయం, షాబాద్ :**

షాబాద్:చేవెళ్ల అసెంబ్లి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. షాబాద్ మండలంలో గురువారం ఉదయం 7:00 గం "నుండి సాయంత్రం 5: 00గం "వరకు ప్రశాంతంగా ఎన్నికల అధికారులు నిర్వహించారు. రేగడి దొస్వాడ, తిరుమల పూర్ గ్రామలలో బి ఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీ ల మధ్య స్వల్ప తగాదాలు జరగగా పోలీసులు వారిని సముదాయించరు. షాబాద్ ఎన్నికల అధికారి చిన్న అప్పలనాయుడు షాబాద్, పోతుగాల్ గ్రామాల్లో పర్యటించి ఎన్నికల విధానాన్ని పరిశీలించారు. షాబాద్ సీఐ యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు గట్టి బందబస్తు చేశారు.షాబాద్ మండలంలో ఎన్నికలని పరిశీలించిన ముగ్గురు ఎం ఎల్ ఏ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామేన భీం భరత్ షాబాద్, కుమ్మరి గూడ గ్రామాలను పరిశీలించారు. బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి కే ఎస్ రత్నం రుద్రరం, దేవునిగడ్డ గ్రామాలను పరిశీలించారు. బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలే యాదయ్య షాబాద్, మల్లారెడ్డి గూడ గ్రామాలను పరిశీలించారు.



# భారీ మెజారిటీతో గెలవబోతున్నా....

- తెలంగాణలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలే నా హీరోలు....
- ఓటేసిన కరీంనగర్ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు
- ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు థ్యాంక్స్...
- తెలంగాణలో మెజారిటీ స్థానాలు సాధించబోతున్నాం
- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వెల్లడి

**కరీంనగర్ బ్యూరో మరో ఉదయం**

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో గెలవబోతున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ లోనూ మెజారిటీ స్థానాలు గెలవబోతున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో అధికార పార్టీ అనేక అడ్డంకులు సృష్టించినా తట్టుకుని కాషాయ జెండా పట్టుకుని తెగించి కొట్లాడిన కార్యకర్తలే నిజమైన హీరోలని అభివర్ణించారు. కరీంనగర్ లో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పి అందరికీ స్పూర్తిగా నిలిచేలా చేస్తామన్నారు. పేదల ఇండ్లను కబ్జా చేసేటోళ్లను, భూకబ్జాదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించిన ఎన్నికల సంఘానికి అభినందనలు తెలిపారు. పోలీసులకు, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనేమన్నారంటే...

ఈరోజు జరిగిన పోలింగ్ సరళిని చూస్తే నాకు పక్కా నమ్మకం ఏర్పడింది. కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలవబోతున్నా.. ఆ నమ్మకం నాకుంది. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన బీజేపీ కార్యకర్తలు నా హీరోలు. అంతేగాదు...తెలంగాణలో టీఆర్ఎస్ నేతలు ఎన్ని ఇబ్బందులు సృష్టించినా ధీటుగా ఎదుర్కొంటూ కాషాయ జెండాలు పట్టుకుని ముందుకు సాగుతూ తెగించి కొట్లాడిన కార్యకర్తలంతా నాకు హీరోలు. ఎన్నికల్లో పూర్తిగా సహకరించిన మంద క్రిష్ణ మాదిగతోపాటు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలందరినీ నా ధన్యవాదాలు. ముఖ్యంగా బీజేపీపట్ల విశ్వాసం, నరేంద్రమోదీపట్ల నమ్మకంతో ప్రజలంతా ఓటు బ్యాంకుగా మారి ఓటేసిన ఓటర్ మహాశయులందరికీ పేరు పేరునా క్రుతజతలు...



కరీంనగర్ లో ఓడిపోతాననే ఆక్రోశంతో అధికార పార్టీ నేతలు అక్కడక్కడా సిబ్బందిపై దుర్భాషలాడినా, కార్యకర్తలపై దాడులు జరిపించేందుకు యత్నించినా మా కార్యకర్రతలు సంయమనంతో వ్యవహరించారు. ఎందుకంటే ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలని, ప్రజాస్వామ్య స్పూర్తిని కాపాడాలన్నదే లక్ష్యంగా పనిచేశాం. ఎగ్జిట్ పోల్స్ పై మీడియా అడిగిన ప్రశ్నకు.... ఎగ్జిట్ పోల్స్ పై ఎవరి అభిప్రాయాలు వారివి. గతంలో దుబ్బాక, జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ తారుమారయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ సీట్లు వస్తాయనే నమ్మకం మాకుంది. డిసెంబర్ 3న వాస్తవ ఫలితాలు వస్తాయి. ఫలితాలు వెలువడ్డాక ఎమ్మెల్యేల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని జాతీయ నాయకత్వం తదుపరి నిర్ణయం తీసుకుంటుంది.

మేనిఫెస్టో హామీల అమలు, కరీంనగర్ లో భూకబ్జాలపై అడిగిన ప్రశ్నలకు.... బీజేపీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది. పేదల ఇండ్లను కబ్జా చేసేటోళ్లను, దౌర్జన్యం చేసేవాళ్లపై తప్పకుండా చర్యలుంటాయి. ప్రజలకు అండగా ఉంటాం. కరీంనగర్ లో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పి స్పూర్తిదాయకమైన వాతావరణాన్ని కొనసాగిస్తాం....

# రంగారెడ్డి లో హస్తం దే హవా....!

### తగ్గిన కారు స్పీడ్....!

### ఒకటి రెండు స్థానాలకే పరిమితం

### కాబోతున్న గులాబీ పార్టీ....!

**రంగారెడ్డి :మరో ఉదయం**

రంగారెడ్డి జిల్లాలో అన్ని స్థానాలు క్లీన్ స్వీప్ చేస్తామని తలంచిన బిఆర్ఎస్ కు ఆశాభంగం తప్పేలా లేదు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు వుంటే అన్నింటిలో కాంగ్రెస్ దే హవా కనిపిస్తుంది. సర్వేలు,రాజకీయ విశ్లేషకులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పోలింగ్ శాతం తగ్గటం అధికార పార్టీపై వున్న వ్యతిరేకతకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కేసీఆర్ పై కసితో వున్న ఓటర్లు ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు తరలిరావటం ఓటుని వినియోగించటం కనిపించింది. ముఖ్యంగా ఈ ఎన్నికలలో యువత బిఆర్ఎస్ కు వ్యతిరేకంగా ర్యాలీ కావటమె కాదు తమ తల్లితండ్రులను కూడా కారుకు వ్యతిరేకంగా మౌల్డ్ చేయటం ప్రధానంగా చెప్పుకోవచ్చు. హస్తం హావా కొనసాగుతుండగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఓటర్లలో ప్రభావం చూపాయనే చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో ఆరు గ్యారంటీలను ప్రజల నట్టింట్లో కి తీసుకువెళ్ళటంతో సక్సెస్ అయ్యారనే చెప్పాలి. బిఆర్ఎస్ చేసిన హామీలు...వాటి ఫెయిల్యూర్ అనే అంశాల ప్రచారం ప్రజలలోకి బలంగా వెళ్ళటం కూడా కాంగ్రెస్ మెజారిటీ స్థానాలు దక్కించుకు పోవటానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాలో వున్న సెటిలర్లు కాంగ్రెస్ వైపుకు ర్యాలీ కావటం కూడా కలిచొచ్చిందనే చెప్పాలి. జిల్లాలోని మంత్రి సబితారెడ్డికి కూడా గట్టి పోటీ తప్పటం లేదు. ఇక్కడ కిచ్చెన్న కు టికెట్ డిక్లేర్ కాక ముందు వరకు పోటీ బిజెపి బిఆర్ఎస్ మధ్యనే కనిపించింది. కాని కెఎల్ఆర్ టికెట్ కన్ఫర్మ్ కావటంతో మహేశ్వరం రాజకీయాల రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. బిజెపి బిఆర్ఎస్ ల మధ్య అనుకున్న పోరు కాస్తా కాంగ్రెస్ వర్సెస్ కారుగా మారింది. బిజెపి పూర్తి వెనకబడి పోయింది. ఇందుకు బిఆర్ఎస్ బిజెపి ఒకటే అని జరుగుతున్న ప్రచారం కాస్తా బిజెపి బలహీనపడటానికి కారణంగా మారింది. జిల్లాలోని ఎనిమిది నియోజక వర్గాలలో జరిగిన పోలింగ్ సరళితో మెజారిటీ స్థానాలలో కాంగ్రెస్ గెలువబోతుందని అంచనా . జిల్లా మొత్తంగా హస్తం జోరు సాగుతున్నా కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల బలహీనత కారణంగా బిఆర్ఎస్ కు ఒకటి రెండు స్థానాలలో గెలిచే అవకాశం కనిపిస్తున్నా మెజారిటీ స్థానాలలో కాంగ్రెస్ గెలవబోతుందని గ్రౌండ్ స్థాయి రిపోర్టులు వస్తున్నాయి.

జిల్లాలోని రాజేంద్రనగర్, చేవెళ్ళలో మాత్రమె బిఆర్ఎస్ కొంత మెరుగ్గా కనిపిస్తూ గెలవటానికి అవకాశం వుండగా మిగతా మహేశ్వరం,ఎల్ బి నగర్, ఇబ్రహీంపట్నం,షాద్ నగర్,కల్వకుర్తి, శేరిలింగంపల్లి లలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజేంద్రనగర్, చేవెళ్ళలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల బలహీనత కారణంగా బిఆర్ఎస్ ముందంజలో వున్నట్లు కనిపిస్తుంది



.మిగతా నియోజక వర్గాలలో బిఆర్ఎస్ గెలిచె పరిస్థితి కనిపించటం లేదు. శేరిలింగంపల్లి,ఎల్ బి నగర్ లలో సెటిలర్లు ఏకపక్షంగా కాంగ్రెస్ వైపుకు ర్యాలీ అయినట్లు కనిపిస్తుంది. అలాగే కల్వకుర్తి, షాద్ నగర్, ఇబ్రహీంపట్నం లలో యువత ,మహిళలు కాంగ్రెస్ వైపుకు మద్ధతు పలకటం ఆ స్థానాలు గెలవటానికి అవకాశాలు వున్నాయి. ఇక మహేశ్వరంలో మాత్రం సబితారెడ్డి, కెఎల్ఆర్ మధ్యన టఫ్ ఫైట్ జరిగింది. ఇక్కడ ముస్లీం మైనారిటీ ఓటర్లు ఏ పార్టీ వైపుకు ర్యాలీ అవుతే ఆ పార్టీ గెలవబోనుంది. ఏదెమైనా జిల్లాలో క్లీన్ స్వీప్ అనుకున్న బిఆర్ఎస్ కు ఒకటి రెండు స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తే జిల్లాలో బిఆర్ఎస్ కు పెద్ద ఎదురుదెబ్బే.

మారో ఉదయం

# పనమ్మాయి కోసం అల్లు అర్జున్ వీడియో

## ఫాలోవర్లు పెరగాలని ఆశిస్తున్నట్లు వెల్లడి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఎంతోమంది హృదయాలను గెలుచుకున్నారు. తను ఒక పెద్ద స్టార్ అయి ఉండీ కూడా, తన ఇంట్లో పనిచేసే ఒక అమ్మాయికి ఫాలోవర్లు పెరగాలని ఉద్దేశంతో ఆ అమ్మాయితో ఒక చిన్న వీడియో చేసి, ఆమెకి ఎక్కువ ఫాలోవర్లు పెరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ వీడియో చూసిన ప్రతి ఒక్కరు అల్లు అర్జున్ ని అభినందించకుండా ఉండలేకపోతున్నారు. ఆమె తన ఫాలోవర్లు ని పెంచుకోవాలని అనుకుంది, అందుకు ఆమె అందుకు తన యజమాని అయిన అల్లు అర్జున్ ని అడిగింది, అతను కూడా సరే అన్నాడు. ఆమెకి ఇప్పటికే పదమూడువేలమంది ఫాలోవర్లు వున్నారని, ఈ అల్లు అర్జున్ వీడియోతో అవి 30 వేలకు పైగా అవుతాయని అనుకుంటున్నట్టుగా చెప్పింది ఆమె. అల్లు అర్జున్ కూడా ఆమెకి బాగా ఫాలోవర్లు పెరగాలని ఆశిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం 'పుష్ప 2' సినిమాతో బిజీగా వున్నా అల్లు అర్జున్, తన ఇంట్లో పనిచేసే అమ్మాయిని పాపులర్ చెయ్యడం కోసం ఈ చిన్న వీడియో చెయ్యడంతో అల్లు అర్జున్ అందరి హృదయాల్ని గెలుచుకున్నారు. ఇప్పుడు ఇది సాంఘీక మాధ్యమంలో విపరీతంగా వైరల్ అవుతోంది.






# డంకీ నుంచి లుట్‌పుట్ గయా...పాల విడుదల

షారూక్ ఖాన్, రాజ్‌కుమార్ హిరాణి కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'డంకీ' రీసెంట్‌గా 'లుట్ పుట్ గయా..' అనే సాంగ్‌ను 'డంకీ డ్రాప్ 2'గా మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హార్డీ పాత్రలో షారూక్, మను పాత్రలో తాప్సీ మధ్య ఉండే ప్రేమను తెలియజేసే ఈ పాట ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందనను రాబట్టుకుంది. ఫ్యాన్స్, సినీ ప్రేక్షకులతో పాటు సంగీతాభిమానులు సైతం ఈ పాటకు ఫిదా అయ్యారు. క్రిస్మస్ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున డిసెంబర్ 21న ఈ సినిమా రిలీజ్ కానుంది. అయితే 'జవాన్' సినిమాలో కుస్తీ గ్రౌండ్ మ్యాజిక్‌ను మరోసారి షారూక్ 'డంకీ'లోనూ తాప్సీతో రిపీట్ చేస్తున్నారు. ఈ విషయం తెలిసి నెటిజన్స్ కొందరు సోషల్ మీడియాలో 'జవాన్'లో దీపికాతో.. 'డంకీ'లో తాప్సీతో.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు. షారూక్, దీపిక ల మధ్య 'జవాన్' (ఏజీలిజీని) మూవీలో చూపించిన కుస్తీ సీన్ ఎంత పాపులర్ అయ్యిందో తెలియంది కాదు. ఇప్పుడు అదే మ్యాజిక్‌ను డంకీలోనూ రిపీట్ చేయబోతున్నారు కింగ్ ఖాన్. దీని గురించి ఫ్యాన్స్ చాలా ఎగ్జయిట్ అవుతూ షారూక్ సరికొత్త రొమాంటిక్ పంథాను కనుగొన్నారని మాట్లాడుకుంటున్నారు. హీరోయిన్స్ అందరూ షారూక్ ఖాన్‌తో కుస్తీ చేయాలంటూ నెటిజన్ ఒకతను పోస్ట్ చేశారు. 'డంకీ' చిత్రంలో టాలెంటెడ్ ఆర్టిస్టులు ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు. బోమన్ ఇరాని, తాప్సీ పన్ను, విక్కీ కౌశల్, విక్రమ్ కొచ్చర్, అనీల్ గ్రోవర్ సహా బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్ ప్రేక్షకుల హృదయాలను దోచుకోనున్నారు. ఏ జియో స్టూడియోస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్, రాజ్‌కుమార్ హిరాణి ఫిల్మ్స్ బ్యానర్స్ సమర్పణలో రాజ్ కుమార్ హిరాణి, గౌరి ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




# క్యాప్షన్ పెడితే..సలార్‌కు ఉచిత టిక్కెట్లు

రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులకు, ప్రేక్షకులకు ఓ సువర్ణ అవకాశం! ఆయన నటిస్తున్న తాజా సినిమా 'సలార్' సినిమాను ఫస్ట్ డే ఫస్ట్ షో చూడాలని ఆశ పడుతున్నారా? ఆ షోకి 'సలార్' టీ షర్టులు, క్యాప్ ధరించి వెళితే బాగుంటుందని ఆలోచిస్తున్నారా? అటువంటి వాళ్ళ కోసమే ఈ అవకాశం! సలార్' చిత్రీకరణలో ప్రభాస్కు తన ఫోనులో దర్శకుడు ప్రశాంత్ నీల్ ఏదో చూపిస్తున్న ఫోటోను చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆ ఫోటోకి క్యాప్షన్ ఇవ్వమని అభిమానులను కోరింది. బెస్ట్ క్యాప్షన్ ఇచ్చిన టాప్ 5 నెటిజనులకు తమ తమ ఏరియాలో 'సలార్' ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్స్ ఇస్తామని పేర్కొంది. అంతే కాదు... మర్చండైజ్ కూడా అందిస్తామని వివరించింది. మరికొన్ని గంటల్లో 'సలార్' ట్రైలర్ రిలీజ్ కానుంది. శుక్రవారం... అనగా డిసెంబర్ 1న రాత్రి 7.11 గంటలకు యూట్యూబ్‌లో విడుదల చేయనున్నారు. ట్రైలర్ విడుదలకు ముందు ఈ ఆఫర్ ఇవ్వడమే కాదు... బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్టోరీ కూడా లీక్ చేశారు దర్శకుడు ప్రశాంత్ నీల్!





# యానిమల్ విడుదలపై ఉత్కంఠ

## భారీ కలెక్షన్లపై మేకర్స్ దృష్టి

యానిమల్' సినిమా విడుదలకు ఇంకా ఎంతో సమయం లేదు. విదేశాల్లో ప్రీమియర్ షోలు మరికొన్ని గంటల్లో పడతాయి. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్' తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన సినిమా కావడం, టీజర్ ట్రైలర్‌లలో యాక్షన్ డోస్ ప్రేక్షకులను అట్రాక్ట్ చేయడంతో సినిమాపై విపరీతమైన బజ్ నెలకొంది. అడ్వాన్స్ బుకింగ్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. మరి, సినిమా ఫస్ట్ డే కలెక్షన్స్ ఎలా ఉంటాయన్నదానిపై ఊహాగానాలు చెలరేగుతున్నాయి. రణబీర్ కపూర్ కెరీర్ చూస్తే... 'సంజు', 'బ్రహ్మాస్త్ర' వంటి భారీ విజయాలు ఉన్నాయి. అయితే... అవి మాస్ ఫిలిమ్స్ కావు. కంటెంట్ బేస్డ్ క్లాస్ ఫిలిమ్స్. 'యానిమల్'కు వస్తే అవుట్ అండ్ అవుట్ సందీప్ రెడ్డి వంగా స్టైల్ కమర్షియల్ ఫిల్మ్. ఆల్రెడీ విడుదలైన ప్రచార చిత్రాల్లో సినిమాలో మాంచి మాస్ కంటెంట్ ఉందని ప్రేక్షకుల్లో నమ్మకం కలిగింది. అందుకు తగ్గట్లు బుకింగ్స్ బాగా జరుగుతున్నాయి. 'యానిమల్' హిందీ వెర్షన్ షోస్ ద్వారా 50 నుంచి 55 కోట్ల రూపాయల గ్రాస్ రావచ్చని ఓ అంచనా. మాస్ సినిమాలకు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో బుకింగ్స్ బావుంటాయి. 'యానిమల్'కు మల్టీప్లెక్స్ థియేటర్లలో సైతం బావున్నాయి. పీవీఆర్, ఐనాక్స్ స్క్రీన్లలో రెండున్నర లక్షల టికెట్స్ అమ్మారు. కేవలం వాటి ద్వారా సుమారు ఏడున్నర కోట్ల వరకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ... రెండు తెలుగు రాష్ట్రాల్లో సైతం 'యానిమల్' అడ్వాన్స్ బుకింగ్స్ బావున్నాయి. తెలుగులో మొదటి రోజు పది కోట్ల రూపాయలు రావచ్చని ఓ అంచనా. ఒక్క హైదరాబాద్ సిటీలో ఫస్ట్ డే కలెక్షన్స్ మూడున్నర కోట్ల నుంచి నాలుగు కోట్ల రూపాయలు ఉంటాయని టాక్.



# ఇంటివాడైన రణ్‌దీప్ హుడా

ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌దీప్ హుడా ఓ ఇంటివాడయ్యాడు. మోడల్, నటి లిన్ లైస్రామ్‌ను ఆయన ప్రేమ వివాహం చేసుకున్నాడు. మణిపూర్ రాజధాని ఇంఫాల్ లోని ఓ దేవాలయంలో వీరి వివాహం నిరాడంబరంగా జరిగింది. మణిపూర్ సంప్రదాయం ప్రకారం ఈ జంట ఒక్కటైంది. ఈ మేరకు పెళ్లి విషయాన్ని తెలియజేస్తూ సోషల్ మీడియా ద్వారా రణ్‌దీప్ హుడా ఫోటోలను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన నెటిజన్లు, పలువురు ప్రముఖులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. లిన్ లైస్రామ్‌తో రణ్‌దీప్ గత కొన్ని రోజులుగా డేటింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాము వివాహం చేసుకోబోతున్నాం అంటూ ఇటీవలే సోషల్ మీడియాలో ప్రకటన చేశారు. 'మహాభారతంలో మణిపూర్ యువరాణి చిత్రాంగదను అర్జునుడు ఎక్కడ వివాహం చేసుకున్నాడో.. అక్కడే మేము ఒక్కటి కాబోతున్నాం. ఈ నెల 29న ఇంఫాల్‌లో కుటుంబసభ్యులు, సన్నిహితులు సమక్షంలో మా (రణ్‌దీప్ హుడా, లిన్ లైస్రామ్) పెళ్లి జరగనుంది. త్వరలోనే ముంబయిలో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నాం. మా ప్రయాణానికి మీ ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాం' అని రణ్‌దీప్ హుడా ఇన్‌స్టాలో రాసుకొచ్చాడు. 2001లో రిలీజైన మన్‌సూన్ వెడ్డింగ్ సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు రణ్‌దీప్ హుడా. ఇక ఆయన నటించిన చిత్రాలలో 'జిస్మ్ 2', 'బాంబే టాకీస్', 'కిక్', 'హైవే' సినిమాలు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇక ప్రస్తుతం బీజేపీ ప్రాపగాండా మూవీ 'స్వతంత్ర వీర్? సావర్కర్' చిత్రంలో నటిస్తున్నాడు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com